చెరువులో మురుగు చేరకుండా చర్యలు చేపట్టాలి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ చెరువులో మురుగు నీరు కలవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని శుక్రవారం గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయం , మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలోని మైల్‌స్టోన్ డెవలపర్స్ కమర్షియల్ కాంప్లెక్స్ వారు తమ డ్రైనేజీ నీటిని సమీపంలో ఉన్న కండ్లకోయ చెరువులో కలిపేందుకు డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు పనులు సాగిస్తున్నారని తెలిపారు. చెరువులో నీరు కలుషితం కావడంతో పాటు భూగర్భ జలాలు కలుషితం అవుతాయని, అధికారులు స్పందించి వెంటనే పనులను నిలిపివేయించాలని ఫిర్యాదులో కోరారు.


చౌదరిగూడలో అక్రమ కట్టడాల కూల్చివేతలు



చౌదరిగూడలో అక్రమ కట్టడాల కూల్చివేయిస్తున్న కార్యదర్శి శశిధర్

ఘట్‌కేసర్: చౌదరిగూడలో అక్రమంగా నిర్మించిన పలు కట్టడాలను పంచాయతీ కార్యదర్శి శశిధర్ శుక్రవారం కూల్చివేయించారు. గ్రామంలోని సాయిసురక్ష, వెంకటాద్రి టౌన్‌షిప్, ఓయూ కాలనీ, డాక్టర్ కాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన కట్టడాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ అనుమతి లేని కట్టడాలు, ప్రభుత్వ భూమిలో నిర్మించిన కట్టడాలను వదిలేది లేదన్నారు.

ఆహ్లాదం పంచుతున్న కేఆర్‌సీ ఎగ్జిబిషన్



బోడుప్పల్: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన కేఆర్‌సీ ఎగ్జిబిషన్ స్థానికులకు ఆహ్లాదం పంచుతోంది. ప్రతిరోజూ సాయంత్రం చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా సందర్శించి ఆనందాన్ని పొందుతున్నారు. నగర శివారు ప్రాంతంలో నిత్యం బిజీగా ఉండే ప్రజలకు ఈ ఎగ్జిబిషన్ ఆట విడుపుగా మారింది. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు నారాయణ తెలిపారు. తాజ్‌మహల్, ఎర్రకోట ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో పాటు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. జెయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, సోలాంబో, డ్రాగన్ ట్రెయిన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్ ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడకు వచ్చిన శివారు ప్రజలు ఎంజాయ్ చేస్తున్నారు. జ్యూవలరీ స్టాల్స్, రెడీమేడ్ స్టాల్స్, స్టాయిల్స్ స్టాల్స్, డ్రైఫ్రూట్ స్టాల్స్, ఆల్ వెరైటీ ఫుడ్ స్టాల్స్ మహిళలు, యువతుల మనసులను దోచేస్తున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 3 నుంచి రాత్రి 10గంటల వరకు నిర్వహిస్తున్న కేఆర్‌సీ ఎగ్జిబిషన్‌ను బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి, ఉప్పల్, ఘట్‌కేసర్, పోచారం ప్రాంత ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి సందర్శిస్తున్నారు.

భవానీనగర్ కాలనీని అభివృద్ధి చేస్తా



మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని భవానీనగర్ కాలనీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. భవానీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను శుక్రవారం కార్పొరేటర్ ఘనంగా సత్కరించారు. అనంతరం కాలనీలో పలు అభివృద్ధి పనులపై కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించి, కాలనీలో అన్ని రోడ్లను వేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచర్ల మధుసూదన్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు వై.సత్యనారాయణ, కృష్ణారెడ్డి, ఆనంద్‌కుమార్, భవానీ అశోక్, రాయుడు, శ్రీధర్‌రెడ్డి, సురేందర్, వీరా ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాలనీలో మరో కొత్త కాలేజీ వద్దు




మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని న్యూసాయినగర్, సాయినగర్ కాలనీలో మైనార్టీ కాలేజీ ఏర్పాటు చేయవద్దంటూ కాలనీవాసులు శుక్రవారం మైనార్టీ కాలేజీ భవనం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సాయినగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బండి కన్వెన్షన్ హాల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పవన్‌రెడ్డి, 23వ డివిజన్ కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఇప్పటికే కాలనీలో ఉన్న నాలుగు కాలేజీలతో పార్కింగ్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. సరైన సౌకర్యాలు లేని బిల్డింగ్‌లో మరో కొత్త కాలేజీని ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా స్పందనలేదని అన్నారు. బీజేపీ నాయకులు జైపాల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, సత్తయ్య, కాలనీవాసులు దేవేందర్, లోడె చంద్రయ్య గౌడ్, రమేష్ చారి, నరేష్, ఉపేందర్, జితేందర్‌రెడ్డి, సోమయ్య, శ్రీనివాస్, సింహాచలం, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నాలాల్లో పూడికతీత పనుల్లో వేగవంతం

అల్వాల్: నాలాల్లో పూడికతీత పనులను వేగవంతం చేసినట్లు మచ్చబొల్లారం డీఈ కార్తీక్ అన్నారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని మూడు ప్రధాన ఓపెన్ నాలాల్లో, రుక్మిణి ఎన్‌క్లేవ్ నుంచి అల్వాల్ చెరువు వరకు, కౌకూర్ జనప్రియ నుంచి నాగిరెడ్డి కుంట వరకు, బొల్లారం రైల్వేస్టేషన్ నుంచి తుర్కపల్లి వరకు ఉన్న నాలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులను శుక్రవారం చేపట్టారు. ఏఈ రవళి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్రోజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందేనా.?

- 507 ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య 89,565
- ఈ ఏడాది అవసరమైన పుస్తకాల సంఖ్య 5.78 లక్షలు
- గోదాముల్లో నిల్వ ఉన్న పుస్తకాల సంఖ్య 4.02 లక్షలు
- మండలాలకు చేరినవి 1.03 లక్షలు
- ప్రారంభం రోజే పంపిణీ చేస్తామంటున్న విద్యాశాఖ



సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్న సర్కారు.. మరో పక్షం రోజుల్లో విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానుండటంతో పుస్తకాల పంపిణీపై విద్యాశాఖ దృష్టి సారిస్తోంది. ఈసారి యూనిఫాం మాదిరిగానే.. ముందస్తుగా అందరికీ పాఠ్య పుస్తకాలు అందిస్తామని విద్యాశాఖ పేర్కొంటోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 1 నుంచి 10వ తరగతి వరకు సుమారు 89,565 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ఈ విద్యాసంవత్సరంలో 5,78,980 పుస్తకాలు అవసరమని విద్యాశాఖ అధికారులు ఇండెంట్ పెట్టగా, ఇప్పటి వరకు 4,02,780 పుస్తకాలు వచ్చాయి. ఇందులో 1,03,355 పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేసేందుకు మండల కేంద్రాలకు చేర్చారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానుండటంతో విద్యార్థులకు వాటిని ఎలా పంపిణీ చేయాలని విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.

పక్కదారి పట్టకుండా..

ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్య పుస్తకాలు పక్కదారి పట్టకుండా ఉండాలన్న ఉద్దేశంతో పకడ్బందీ చర్యలు చేపట్టారు. రెండేళ్లుగా ప్రభుత్వం పంపిణీ చేసే పుస్తకాలపై ప్రత్యేక సంఖ్యను ముద్రించడంతో పాటు ప్రత్యేక కోడ్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి విద్యార్థి ఆధార్ నంబర్ వివరాలు నమోదు చేసుకున్నాకే పాఠ్య పుస్తకాలు అందిస్తారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికి మాత్రమే ఉచిత పాఠ్యపుస్తకాలు అందుతున్నాయి.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలందించాలి

వైద్యాధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ మీటింగ్ హాల్లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా జిల్లాలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్ (సీ–సెక్షన్) తగ్గించాలని కోరారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ తప్పనిసరిగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను సందర్శించి సీ- సెక్షన్ ఆడిట్ నిర్వహించాలన్నారు. బస్తీ దవాఖానాల్లో మెడిసిన్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా సాధారణ ప్రసవాలు, సిజేరియన్లు ఎంత మేరకు జరుగుతున్నాయని ఆసుపత్రుల వారీగా ఆయన అడిగి తెలుసుకున్నారు. స్క్రీనింగ్ పరీక్షలు ఏ విధంగా జరుగుతున్నాయని, ఎలా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ కింద ఎన్ని కేసులు వచ్చాయని ఆరా తీశారు. 108 వెహికల్స్ పనితీరుపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్క్రీనింగ్ పరీక్షల తర్వాత బస్తీదవాఖానా, పీహెచ్‌సీల్లో హైపర్‌టెన్షన్, షుగర్ మందుల పంపిణీ ఎలా జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఫ్రీగా మందులు ఇస్తుందనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథ స్వామి, డీసీహెచ్, ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యాధికారులు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోళ్లలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి రేఖమేరీ



సాక్షి, మేడ్చల్ జిల్లా: వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులు విత్తనాలు కొనుగోలులో పలు జాగ్రత్తలు తీసుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ అధికారి రేఖమేరీ సూచించారు. అక్రమ మార్గంలో నాణ్యత లేని విత్తనాలను తక్కువ ధరకు విక్రయిస్తున్నారని, ఈ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విత్తన కొనుగోళ్లలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి గ్రామస్థాయిలో ఉదయం 7:30 నుంచి 11:30 వరకు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో ఏఈఓ/ఏవో, పంచాయతీ కార్యదర్శులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. ప్యాకింగ్, లేబుల్ కలిగిన విత్తనాలు మాత్రమే కొనాలన్నారు. కాల పరిమితి చెల్లిన విత్తనాలు ఉంటే తక్షణమే స్థానిక వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కొనుగోలు చేసిన డీలర్ నుంచి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విత్తన పాకెట్ బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలన్నారు. విడిగా గుర్తు తెలియని వ్యక్తులు, లైసెన్స్ లేని వారి నుంచి విత్తనాలు కొనుగోలు చేయకూడదని తెలిపారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు

కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్

కీసర: కీసర మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ అన్నారు. కీసర మండలం యాద్గార్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 51, 53లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీని శుక్రవారం జేసీబీ సహాయంతో కూల్చివేసి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకొని సూచిక బోర్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్ స్థలాలను అన్యాక్రాంతం చేసే వ్యక్తులపై చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

అక్రమంగా నిర్మించిన ప్రహరీ కూల్చివేత

మేడ్చల్‌రూరల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో అక్రమ నిర్మాణాన్ని శుక్రవారం అధికారులు కూల్చివేశారు. గ్రామంలోని సర్వే నెంబర్615, 620, 642, 680 సర్వే నంబర్లలో విష్ణుతేజ వెంచర్ ఏర్పాటు చేశారు. వెంచర్ చుట్టూ ఎలాంటి అనుమతులు లేకుండా ప్రహరీ నిర్మించడంతో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి జిల్లా అధికారులు ఆదేశాల మేరకు కూల్చివేతలు చేపట్టారు.

సేవతోనే సంతృప్తి



గౌతంనగర్: సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి కలుగుతుందని మాజీ సైనికుడు పి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మిర్జాలగూడ రాజ శ్రీనివాసనగర్‌లో పలువురు పేద మహిళలకు ఆయన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



కుషాయిగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించి సకాలంలో పనులు పూర్తి చేయాలని కార్పొరేటర్ ప్రభుదాస్ సూచించారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ ఇందిరానగర్ కాలనీలో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. పనులు జరిగే క్రమంలో తగిన జాగ్రత్తలు పాటించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట దుర్గారెడ్డి, శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆరెంజ్ బౌల్ ఎదురుగా నిర్మించిన ప్రహరీ కూల్చివేత



ఆరెంజ్ బౌల్ వద్ద గోడను తొలగిస్తున్న అధికారులు

శామీర్‌పేట్: హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారికి ఆనుకొని ఉన్న ఆరెంజ్ బౌల్ రిసార్ట్స్ గేటు వద్ద ఉన్న ప్రజా అవసరాల రోడ్డును కొందరు వ్యక్తులు కబ్జా చేసి అడ్డుగా గోడ నిర్మించారు. దీంతో సెలబ్రిటీ విల్లా ఓనర్స్ మ్యూచ్‌వల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు మేడ్చల్ జిల్లా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో శుక్రవారం అధికారులు జేసీబీల సాయంతో గోడను కూల్చివేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ఆరెంజ్ బౌల్ (సెలబ్రిటీ రిసార్ట్స్)లో 104 విల్లాలు, సుమారు 1,200 ప్లాట్లు ఉన్నాయని, 25 సంవత్సరాలుగా ప్లాట్ల ఓనర్లు



ఆరెంజ్ బౌల్ గేట్ రోడ్డునే వినియోగించుకున్నామని తెలిపారు. గత సంవత్సరం అప్పటి అధికార పార్టీ అండదండలతో కొందరు వ్యక్తులు గేటు, రోడ్డును కబ్జా చేసి అడ్డంగా గోడ నిర్మించారన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి, సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఒకే కాలనీ.. మూడు రోజులు.. మూడు చోరీలు

- బంగారం, వెండి, నగదు అపహరణ
- పోలీసులకు సవాల్ విసురుతున్న ముఠా



ప్రజయ్ హోమ్స్‌లో చోరీ జరిగిన ఇళ్లు



బీరువాను ధ్వంసం చేసిన దుండగులు

శామీర్‌పేట్: ఒకే కాలనీ, మూడు రోజుల వ్యవధి, మూడుచోట్ల చోరీలు చేసి మొత్తం 33 తులాల బంగారం, వెండితో పాటు కొంత నగదును అపహరించిన దొంగలు శామీర్‌పేట పోలీసులకు ఛాలెంజ్ విసురుతున్నారు. వివరాలు... శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ గ్రామ పరిధి, ప్రజయ్ హోమ్స్‌లో గుర్క అనిల్‌కుమార్ యాదవ్ ఇంట్లో మూడు రోజుల క్రితం మంగళవారం అర్ధరాత్రి చోరీ చేసిన దొంగలు 12.50 తులాల బంగారం, రూ.68 వేల నగదును అపహరించారు. ఈ ఘటన మరువక ముందే అదే కాలనీ ప్రజయ్‌హోమ్స్‌లోని శ్రీనివాస్, షఫీ ఇళ్లలో గురువారం రాత్రి దుండగులు చొరబడి 30 తులాల బంగారంతో పాటు వెండి వస్తువులు, కొంతమేర నగదును దోచుకెళ్లినట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు.

తాళాలు ఉన్న ఇళ్లు టార్గెట్..

మూడు రోజుల్లో శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలు చూస్తుంటే తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వేసవి సెలవులు కావడంతో ఎక్కువ మంది విహారయాత్రలకు వెళ్తున్నారని, దీంతో దొంగలు రెచ్చిపోతున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు.

పనిచేయని కెమెరాలు..

మజీద్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 37 కెమెరాలు ఉండగా ఇందులో ఒక్కటే పని చేస్తోంది. ఇది కూడా ఒక రకంగా దొంగలకు మంచి అవకాశంగా మారింది.

పాఠశాల పేరుతో పుస్తకాల విక్రయం

కుషాయిగూడ: పాఠశాల పేరుతో పుస్తకాలు ముద్రించి విక్రయిస్తున్నారంటూ ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు శుక్రవారం కుషాయిగూడలోని గౌతమ్ మోడల్ స్కూల్ ఎదుట ఆందోళన చేపట్టారు. నింబంధనలు ఉల్లంఘించిన గౌతమ్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేసి పాఠశాల ఎదుట బైఠాయించారు. ఈ విషయంపై కాప్రా మండల విద్యాశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది గౌతమ్ మోడల్ స్కూల్‌కు చేరుకొని పుస్తకాల విక్రయంపై విచారణ చేపట్టారు. నింబంధనలు ఉల్లంఘించి పుస్తకాలు విక్రయిస్తున్న గదిని అధికారులు సీజ్ చేసి హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలో జీవో నెంబర్–1ను పూర్తిగా తుంగలో తొక్కి కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యాపార కేంద్రాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా..

పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

పోచారం: సబ్ స్టేషన్లలో మరమ్మతులు, కరెంట్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏపీ మీట్ ఫీడర్ పరిధిలోని నారపల్లి, మహాలక్ష్మిపురం, సప్తగిరి కాలనీ, సురేందర్ రెడ్డినగర్, బాబానగర్, గణేష్‌నగర్, నారపల్లి ప్రాంతాలకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జోడిమెట్ల ఫీడర్ పరిధిలోని అన్నానగర్, డాక్టర్స్ కాలనీ, జోడిమెట్ల క్రాస్ రోడ్, అరుంధతి కాలనీ, హుడా కార్తికేయ, కాకతీయనగర్, స్వర్ణగిరి కాలనీ, వైష్ణవి కాలనీ, చౌదరిగూడ ప్రాంతాలకు, మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పర్వతాపూర్ వ్యవసాయ ఫీడర్ పరిధిలోని సప్తగిరి కాలనీ, సత్తిరెడ్డి వ్యవసాయ బావి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, సేజ్ స్కూల్ దగ్గర, బాపూజీనగర్, సర్వోదయ కాలనీ, ధరణి కాలనీ, సుదర్శన్‌నగర్ కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

11కేవీ తిమ్మాయిపల్లి ఫీడర్ పరిధిలో..

కీసర: 11కేవీ తిమ్మాయిపల్లి విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, ధర్మారం, ఫారెస్ట్ రిడ్జ్, సైలెంట్ వరల్డ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, అదేవిధంగా 33/11కేవీ చీర్యాల ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్ఎల్ఎన్ హోమ్స్, ఎన్ఎస్ఆర్, బృందావన్, గణేష్ టౌన్‌షిప్, ఎంఎల్ఆర్ కాలనీ, శ్రీబాలాజీ ఎన్‌క్లేవ్, పుష్పకాలనీ, స్వరూప్‌నగర్, మల్లన్నటెంపుల్, గీతాంజలి కాలేజ్‌కాలనీ, శివసాయినగర్, రోజ్‌గార్డెన్, ఎస్సీకాలనీ, ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

నాగారం మున్సిపాలిటీలో..

నాగారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఆర్‌జీకే కాలనీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆర్‌జీకేకాలనీ, హరిదాస్‌పల్లి, సింధువనం తదితర ప్రాంతాల్లో, 11కేవీ భారత్‌రత్నా కాలనీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు వీఆర్ఆర్ హోమ్స్ ఫేస్–1, 2, బాలాజీనగర్, కేఎల్ఆర్ వాటర్ ప్లాంటు, వీఆర్ఆర్ లక్ష్మీగణపతి హోమ్స్, బండ్లగూడ మజీద్ రోడ్డు, లక్ష్మీనగర్, పల్లవిస్కూల్, సెంట్ ఆండ్రూస్ స్కూల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నాగారం విద్యుత్ ఏఈ కామేశ్వర్‌రావు తెలిపారు.

షటర్ తాళాలు పగలగొట్టిన వ్యక్తిపై కేసు



కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కమలాదేవి, ఉద్దేమర్రి సోమన్న తదితరులు

కీసర: దౌర్జన్యంగా షటర్ తాళాలు పగలగొట్టిన వ్యక్తిపై కీసర పోలీసులు కేసు నమోదు చేశారు. కీసర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కీసరకు చెందిన కమలాదేవికి కీసర ప్రధాన చౌరస్తాలో ఓ ఇల్లు ఉంది. కమలాదేవికి చెందిన ఇంట్లోని ఓ షటర్‌ను రెండు సంవత్సరాలుగా ఉద్దెమర్రి సోమయ్య అనే వ్యక్తి కిరాయికి తీసుకొని రియల్ ఎస్టేట్ ఆఫీస్ కోసం వినియోగిస్తున్నాడు. శుక్రవారం కీసర గ్రామానికి చెందిన జె.అశోక్ అనే వ్యక్తి దౌర్జన్యంగా షటర్ తాళాలు పగలగొట్టి, ఈ షటర్ తనదేనని సోమన్నతో వాగ్వాదానికి దిగాడు. ఇంటి ఓనర్ కమలాదేవితో కలిసి సోమన్న కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ



పోచారం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం, రుద్రవల్లి గ్రామానికి చెందిన బిజిలీ తిరుపతి, సరిత దంపతులు కూలి పనుల కోసం అన్నోజిగూడకు వచ్చి తాజ్ టిఫిన్స్ సెంటర్ దగ్గర నివసిస్తున్నారు. సమీపంలోని జ్యూస్ సెంటర్‌లో సరిత పనిచేస్తోంది. తిరుపతి కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం సొంత ఊరికి వెళ్లి వచ్చేసరికి దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ చేశారు. అప్పు తీర్చడానికి ఉంచిన రూ.1.40 లక్షల నగదు, కుమార్తె కోసం కొనుగోలు చేసిన 16 తులాల బంగారం, 35 తులాల వెండిని దొంగలు దోచుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. క్లూస్ టీంతో పాటు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు



సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్య వ్యాపార రంగంగా మారిన తరుణంలో రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాల్సిన అవసరం ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఈసీఐఎల్‌లోని జిల్లా కార్యాలయంలో 'తెలంగాణలో ఫీజుల నియంత్రణ చట్టం – ఆవశ్యకత'పై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టం అమలుపై ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఏర్పాటు చేయాలని తీర్మానంలో కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. ఫీజుల నియంత్రణ చట్టం తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా.. ఇప్పటి వరకు ఎలాంటి చొరవ చూపలేదని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 374 విద్యాసంస్థల్లో సర్వేలు నిర్వహిస్తే విద్యార్థి తల్లిదండ్రులు విద్యకు రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తేలిందన్నారు. ప్రభుత్వ విద్యా రంగంపై తల్లిదండ్రులకు నమ్మకం లేదన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో సరైన సౌకర్యాలు, టీచర్స్ లేరన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ వర్క్‌షాప్‌ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆకర్షితున్నట్లు తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో దాదాపు రూ.82 వేల కోట్ల విద్యా వ్యాపారం నడుస్తోందన్నారు. సమావేశంలో ఎస్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి వరప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, రాథోడ్ సంతోష్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.వినోద, మహిళా సంఘం నాయకురాలు శారద, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ అన్వర్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు సతీష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, ఏఐవైఎఫ్ నాయకుడు ప్రసాద్, మహేష్, స్ఫూర్తి గ్రూప్ ప్రతినిధి శ్రీమన్నారాయణ, విజ్ఞాన వేదిక ప్రతినిధి యాదగిరిరావు, గిరిష్, జేవీవీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, గిరీష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వంశీ, అవినాష్, కార్తీక్, మహేశ్వర్, శివ పాల్గొన్నారు.